# జరిగిందేమిటి?

పి. భాస్కరలక్ష్మి



అబ్బబ్బా, మీ పని ఎప్పటికి తెముల్తుందో, విసుగొస్తోంది– చీర చెరగుతో చెయ్యి తుడుచుకొంటూ వంటింట్లోంచి హాల్లోకి వచ్చింది దేవకి.

దేవకీ, దువ్వెనేదీ?– బెడ్‌రూమ్‌లోంచి శ్రీవారి గావుకేకలు వినిపిస్తున్నాయి

క్షణం తీరికుండదు పని దాటేవరకూ. పిల్లలు యిప్పుడే కదండీ దువ్వుకొని వెళ్ళేరు ఎక్కడపెట్టేరో చూడండి సరిగ్గా హాల్లోంచే సమాధానం చెప్పింది.

ఇంతట్లోనే తలుపు దబదబా చప్పుడవ్వటంతో ఆ! వస్తున్నా అంటూ వీధి తలుపు తీసింది

"ఏమే గంగీ: పనివేళల్లో ప్రొద్దున్నే రావద్దని ఎన్నిసార్లు చెప్పాను? మధ్యాహ్నం వస్తేనాకు తీరుబడిగా వుంటుంది"

"ఏటో లెండమ్మగోరూ! మదినాల సాకిరేవు కెళ్లాల. అందుకని యిప్పుడే తెచ్చేసినా బట్టలు—"బట్టల మూట విప్పుతూ అంది గంగి.

చాపతెచ్చి పరచింది దేవకి.

బట్టలు వేటికవి విడివిడిగా పెడుతోంది గంగి, మరి నేవెళ్లొస్తా దేవకీ—అన్నాడు రామారావు బూటు వేసుకొంటూ

భర్తను మెట్ల వరకూ సాగనంపి, సెకిలు, సందులో కనుమరుగయ్యేవరకూ చూస్తూ నిలబడిన దేవకి, గంగి అరుపుతో యీ లోకంలోకి వచ్చింది.

"అమ్మగోరూ! బుక్కట్టుక రండి, పద్దు సూద్దురుగాని"

"గంగీ! యీ పుస్తకం వకటి ఎక్కడ దాచినా పిల్లలు వాళ్ళ పుస్తకాలలో కలిపేస్తారు. నువ్వు వచ్చిన తరువాత అరగంటైనా వెతకాలి ఆ పుస్తకం కోసం"

"మనకది కొత్తేటండి—ముసి ముసి నవ్వులు చిలకరిస్తూ అంది గంగి.

వెతగ్గా వెతగ్గా చెక్కపెట్టె వెనక, మట్టికొట్టుకుపోయి కనిపించింది పుస్తకం.

"ఏమిటి గంగీ! మళ్ళీ యీసారి కూడా రెండు చిన్నచొక్కాలు, ఒక తువ్వాలు తేవాలి. నీకు ఎలా కుదర్చాలో నాకు తెలుసు డబ్బివ్వకపోతే సరి"

"ఎటమ్మగోరూ — ఎవరి గుడ్డల్లో నేనా కలిపినయ్యేమో! చంటబ్బాయి గారి చొక్కాలు చేసూసి తెత్తాలెండి, నాడబ్బులిచ్చెయ్యండి—సోడా అవీ కొనాల."

"తువ్వాలు, జుబ్బాలు తెచ్చాకే డబ్బిస్తాను, మరెవరి దగరేనా తీసుకో!"

"నే వెతుక్కొస్తాగందా, రేపీపాటికి డబ్బిచ్చెయ్యండమ్మగోరూ" అడిగింది మళ్ళీ.

"ఎన్నిసార్లు చెప్పను నీకు? ఇంకెక్కడేనా తీసుకో— బట్టలు తెచ్చివ్వగానే ఇచ్చేస్తాను" మరింక మాట్లాడేది లేనట్లు టేబులు మీదున్న పత్రికలో బొమ్మలు చూడసాగింది.

సరేలెండమ్మగోరూ, రేపు మీ గుడ్డలట్టుకొచ్చి డబ్బులట్టుక పోతాను. రుసరుసలాడూ మాసిన గుడ్డలమూట చంకనెట్టుకుని బయటకు నడిచింది రంగి.

అమ్మయ్య— అనుకొంటూ వీధితలుపు గడియవేసి వచ్చింది దేవకి కుర్చీలో చీర ఆమె దృష్టిలో పడింది.

గులాబిరంగు ఫుల్ వాయిల్ చీర. ఎక్కువపాతది కాదేమో మెరుపు మాయలేదు. నల్లటి గుర్రాల బోర్డరుతో ముచ్చటగా వుంది

బహుశా రంగి మర్చిపోయివుంటుంది బట్టలన్నిటితో పాటు, ఆ చీరను కూడా బీరువాలో పెట్టింది.

భోజనం చేస్తున్నంతసేపూ ఆ చీర గురించే ఆలోచన—చంటివాడికి ఒక చిన్న వెండిగిన్నె కొందామనివుంది. ఆయనతో చెప్తే, ఆ వెండి బోలెడు ధర, ఎందుకు లెద్దూ అని త్రోసిపారేస్తారు.

పోనీ.... ఆ ఆలోచన వచ్చేసరికి దేవకి మనస్సు ఆనందంతో నిండిపోయింది గబగబా భోంచేసింది ఉత్సాహంతో.

రెండురోజులు గడిచినా గంగిరాలేదు

మూడోరోజున, బట్టలు తేవలసినవి తెచ్చేసి, డబ్బు పట్టుకెళ్ళిపోయిండి. అది చీరప్రస్తావనే తీసుకొని రాలేదు. తేలిగ్గా ఊపిరి పీల్చుకొంది దేవకి.

మన బాబిగాడికి వెండిగిన్నె కొన్నాను భోజనాల సమయంలో మెల్లిగా చెప్పింది భర్తతో.

వెండిగిన్నా? ఎందుకిప్పుడు ఈ నెల అసలే లోటుబడ్జెట్.

మనకు లోటు బడ్జెట్ ఏ నెల లేదు కనుక—భర్తగారికి నవ్వురాపుకొంటూ అందిదేవకి. నిజంగా వెండిగిన్నె కాదండీ బాబూ వెండిగిన్నె ఆకారంలో వున్న స్టీలు మట్టుగిన్నె.

ఓహో! పాతబట్టల వాళ్ళ దగ్గర కొన్నావా? మొన్ననేగా కొందామన్నా బట్టలేమి లేవన్నావు!

ఒకచీర, పెద్దాడి పాతనిక్కరు చొక్కా వేస్తేనే యిచ్చాడు. బరువుకూడా వుంది బాగానూ వుందికదా అని పుచ్చుకొన్నాను పైకెగరేస్తూ అంది దేవకి.

నీ గిన్నెను చూసి తరువాత మురిసిపోదువుగాని కానీ, మాకు మజ్జిగ పొయ్యమని విన్నపము—పిల్లలిద్దరూ పకపకా నవ్వారు.

రెండురోజులు చంటాడికి వెండి గిన్నెలో అన్నం తినిపించింది ముద్దుగా ఎందుకో ఆ గిన్నెను చూసినప్పుడల్లా ఆ చీరే గుర్తుకొచ్చేది. ఎవరిదో! గంగిని వాళ్ళు ఎన్ని చీవాట్లేస్తున్నారో! కొంచెం బాధగా అనిపించింది దేవకికి.

మూడోరోజున మామూలుగా అన్నం కలుపుదామని, అలమారులో శుభ్రంగా తోమి బోర్లించిన గిన్నె తీసింది దేవకి.

ఏముంది. స్టీలు గిన్నె యినుపముక్కలు నల్లగా, అక్కడక్కడా తెల్లగా మారుస్తూ, నీకిదే శాస్తి, అన్నట్లుగా వెక్కిరిస్తూ కనిపించింది.

పక్కింటి పిన్నిగారి మాటలే చెవులో మారుమ్రోగాయి. యీ మధ్య యినుప సామాన్లకి స్టీలు పూతపూసి అమ్ముతున్నారుట. జాగ్రత్త సుమీ! ఏమైనా కొన్నప్పుడు. ఏమయింది అన్నట్లు బాబిగాడు చీరకుచ్చెళ్ళు లాగుతూండటంతో యీ లోకంలోకి వచ్చిన దేవకి, చివరకు నాకు మిగిలిందేమిటి అనుకొంది, నిర్లిప్తంగా.

★

రు. 6/- లతో

'ఇంగ్లీషు మెట్రిక్ ప్యాసవ్వండి'

400 పేజీలు ధర రు 6/-
పోస్టేజి, ప్యాకింగు రు 2-25 అదనం
అసాధారణమైన ఈ పుస్తకం సహాయముతో హై / హయ్యర్ సెకండరీ తరగతులు తప్పక ఉత్తీర్ణులయేందుకు హామీ యిస్తాం.

Cambridge Book Depot
(FA-1) Jaigari ALIGARH